సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 27 । మార్చి । 2024



చినజీయర్‌స్వామికి స్వాగతం

జ్యోతినగర్: విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలకు విచ్చేసిన శ్రీత్రిదండి చినజీయర్‌స్వామికి ఎన్టీపీసీలో భక్తులు ఘనస్వాగతం పలికారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ(సా॥)	సహర్ గురు(ఉ॥)
కరీంనగర్	6.28	4.45
పెద్దపల్లి	6.35	4.51
రాజన్న సిరిసిల్ల	6.35	4.53
జగిత్యాల	6.35	4.51

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.8/22.2

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలంతా వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, రాత్రి వేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తొలిదశ ర్యాండమైజేషన్ పూర్తి

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా తొలిదశ పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 290, రామగుండంలో 260, మంథనిలో 53 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. వీటికి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓపీవోలను నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీవో గంగయ్య, డీఈవో మాధవి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, ఈడీఎం కవిత, ఏఎస్‌వో అజీం, నెట్‌వర్క్ ఇన్‌చార్జి రమేశ్ పాల్గొన్నారు.

భద్రాచల రాముడికి గోటితో ఒలిచిన తలంబ్రాలు



తలంబ్రాలు పంపిస్తున్న మహిళలు

జ్యోతినగర్(రామగుండం): భద్రాచల రాముడి కల్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలను శ్రీసీతారామ సేవా సమితి సభ్యులు పంపించారు. మంగళవారం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనిలో జరిగిన కార్యక్రమంలో నర్రాశాలపల్లె, మేడిపల్లి మంచిర్యాల, నస్పూర్ ప్రాంతాలకు చెందిన శ్రీసీతారామ భక్తులు రామదాసు తిరుపతి-తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనం తనిఖీ పర్యవేక్షిస్తున్న అరుణశ్రీ

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గోదావరిఖని గోదావరి వంతెన వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ మంగళవారం తనిఖీ చేశారు. వాహనాల తనిఖీని ఆమె పర్యవేక్షించారు.

పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న పోలీసు బలగాలు

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం పోలీసులు జిల్లా కేంద్రంలో కవాతు నిర్వహించారు. జెండా కూడలి వద్ద ఏసీపీ గజ్జి కృష్ణ జెండా ఊపి కవాతు ప్రారంభించారు. పారా మిలటరీ అధికారులు, సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్‌రావుతోపాటు కేంద్ర పారా మిలటరీ బలగాలు పాల్గొన్నాయి.

తాగునీటి సమస్య రానీయొద్దు

పెద్దపల్లిరూరల్: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మంగళవారం జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షలకు 7,716 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. 7,728 మంది విద్యార్థులకు 7,716 మంది పరీక్ష రాశారని ఆమె పేర్కొన్నారు. మూడు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు 12 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారని పేర్కొన్నారు. తాము మరో మూడు పరీక్ష కేంద్రాలు పరిశీలించినట్లు ఆమె వివరించారు.

అగ్రగామిగా నిలవాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించిన రెట్టింపు ఉత్సాహంతో భవిష్యత్‌లో ముందుకు సాగాలని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25నాటికి నిర్దేశిత లక్ష్యాలు సాధించి 102శాతంలో ఏరియా నిలిచిందన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలన్నారు. ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, ఇంజినీర్ రాంమూర్తి అధికారులు సైతులు, చిలక శ్రీనివాస్, చంద్రశేఖర్, ఆంజనేయులు, ధనలక్ష్మీబాయి, శివనారాయణ పాల్గొన్నారు.

కాక రేపుతున్న టికెట్

- గడ్డం వంశీకి టికెట్ కేటాయింపుపై కాంగ్రెస్‌లో అసమ్మతి మంటలు
- ఫ్యామిలీ పాలిటిక్స్, పారాచూట్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆగ్రహం
- స్థానిక మాదిగలకు అవకాశం ఇవ్వాలంటున్న నాయకులు



సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఎంపీ టికెట్ల పంచాయితీ ప్రకంపనలు సృష్టిస్తోంది. దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకొని జెండా మోసిన నేతలకు టికెట్ల కేటాయింపులో మొండిచేయి చూపారని ఆశావహులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ముందు వచ్చిన చెవులకన్నా.. వెనుక వచ్చిన కొమ్ములకే ప్రాధాన్యం' రీతిలో కాంగ్రెస్ పార్టీలో కొందరి తీరుందని మండిపడుతున్నారు. పార్టీకి విధేయులైన తమను కాదని ఎన్నికల ముందు వచ్చిన వారిని బరిలో దించాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ కేటాయింపుపై పునరాలోంచకపోతే వచ్చే నెల 5న జిల్లాకేంద్రంలో న్యాయపోరాట దీక్ష చేస్తానని యువజన కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. టికెట్ ఆశించి భంగపడిన పలువురు ఆశావహులు సైతం ఒక్కొక్కరు ఒక్కో విధంగా తమ ఆగ్రహాన్ని చూపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

మాదిగల గుర్రు..

- రాష్ట్రంలో పెద్దపల్లి, నాగూర్ కర్నూలు, వరంగల్ ఎంపీ స్థానాలను ఎస్సీలకు కేటాయించారు. ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వం మాల సామాజిక వర్గానికి చెందిన గడ్డం వంశీకృష్ణను పెద్దపల్లి, మల్లు రవిని నాగూర్ కర్నూల్ అభ్యర్థులుగా ప్రకటించింది. వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ఇంకా ఎవరినీ ఫైనల్ చేయలేదు.
- మూడింటిలో రెండు స్థానాలను మాల సామాజికవర్గానికే కేటాయించటంపై ఎమ్మార్పీఎస్ నేతలు మండిపడుతున్నారు.
- మాదిగలు అత్యధికంగా ఉండే పెద్దపల్లి పార్లమెంట్ స్థానం తమకే కేటాయించాలంటూ జిల్లాకేంద్రంలో దీక్షలు, వివిధ నిరసన కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించారు. అయినా, 'కాకా' ఫ్యామిలీకి టికెట్ కేటాయించడంపై మాదిగ సామాజికవర్గానికి చెందిన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒకే కుటుంబానికి అవకాశాలపై చర్చ

రాష్ట్రంలో కుటుంబపాలనకు వ్యతిరేకంగా పోరాడి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు అదే విషయాన్ని మరిచి కాకా(జి.వెంకటస్వామి) కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడంపై కాంగ్రెస్ శ్రేణులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. గడ్డం వినోద్‌కుమార్‌కు బెల్లంపల్లి, బీజేపీ నుంచి ఎన్నికల ముందు వచ్చిన గడ్డం వివేక్‌కు చెన్నూరు ఎమ్మెల్యేలుగా పార్టీ అవకాశం కల్పించిందని, ఇప్పుడు ఎంపీ టికెట్ అదే కుటుంబానికి ఇవ్వడం ఏమిటని సొంత పార్టీలోని నాయకులే నిలదీస్తున్నారు. స్థానిక మంత్రి శ్రీధర్‌బాబు, డీసీసీ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యేలను సంప్రదించకుండానే తరచూ పార్టీలు మారే ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వడంపై పార్టీ పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు పెద్దపల్లిలో కుటుంబపాలన అంటూ తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో అభ్యర్థిని మార్చాలంటూ అధిష్టానానికి విన్నవిస్తున్నారు.

అన్నీతానై చక్కబెడుతున్న వివేక్..

మూడు నెలల ముందు కాంగ్రెస్‌లోకి వచ్చిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తన కుమారుడికి టికెట్ ఇప్పించుకోవడంలో సక్సెస్ అయ్యారు. అలాగే ఎన్నికల్లో కొడుకును గెలిపించుకునేందుకు అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. పార్టీలో అసమ్మతి నేతలను బుజ్జగిస్తూనే, పార్లమెంట్ పరిధిలోని మంత్రి, ఎమ్మెల్యేలను, ఇతర ప్రజాప్రతినిధులను సమన్వయం చేస్తూ వారి మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. తన తండ్రి, మాజీఎంపీ, దివంగత గడ్డం వెంకటస్వామి కాలం నుంచి కలిసి పనిచేసి, ప్రస్తుతం వివిధ పార్టీల్లో ఉన్న నేతలకు హస్తం గూటికి చేర్చేలా ముందుకుసాగుతున్నారు.

5న ఆమరణ నిరాహార దీక్ష



మాట్లాడుతున్న ఊట్ల వరప్రసాద్

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి ఎంపీ టికెట్ ప్రకటనపై అధిష్టానం పునరాలోచన చేయాలని యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ కోరారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన వారిని కాకుండా పారాచూట్ నేతలకు టికెట్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు విజ యరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తోపాటు కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఎంపీ టికెట్ స్థానికులకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 'పెద్దపల్లి టికెట్ వచ్చుడో.. వరప్రసాద్ సచ్చుడో' నినాదంతో ఏప్రిల్ 5న జిల్లా కేంద్రంలో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభిస్తామని ఆయన అన్నారు. సమావేశంలో సుల్తానాబాద్ మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఊట్ల రమ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడితే భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని, ఇసుక రీచ్‌ల వద్ద తవ్వకాలను అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఇసుక రవాణాపై సమీక్షించారు. చెక్‌డ్యాంలకు 500 మీటర్ల సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని ఇసుక వాహన డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే రీచ్‌ల నుంచి ఇసుక తరలింపు ఆపేయాలని సూచించారు. ప్రభుత్వ పనులకు అవసరమైన ఇసుకను ఆర్డీవో, తహసీల్దార్ అనుమతితో తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. టీఎస్‌ఎండీసీ కేటాయించిన రీచ్‌ల నుంచే నిబంధనల ప్రకారం ఇసుక తరలింపు పక్కాగా ఉండాలని ఆయన చెప్పారు. స్థానిక అవసరాల కోసం గ్రామస్తులు ఇతసుక తీసుకెళ్లేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి అనుమతిస్తారని ముజమ్మిల్‌ఖాన్ వివరించారు. 3 క్యూబిక్ మీటర్ల ఇసుక పట్టే వాహనంలోనే రవాణా చేసేందుకు అనుమతులివ్వాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో 26 రీచ్‌లు..

జిల్లాలో 26 ఇసుక రీచ్‌లు ఉన్నా ప్రస్తుతం 18 రీచ్‌ల నుంచే రవాణా సాగుతోందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. స్థానిక అవసరాలు, ప్రభుత్వ నిర్మాణాలకు కేటాయింపులు పూర్తయ్యాకే టీఎస్‌ఎండీసీకి ఇసుక రీచ్‌లు కేటాయిస్తామని వివరించారు. ఇసుక రవాణా పారదర్శకంగా జరిగేలా చూసేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారమయ్యేలా వ్యవస్థను పకడ్బందీగా రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, డీపీవో ఆశాలత, మైనింగ్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి యాసంగి ధాన్యం కొనుగోలు చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈసారి 3,04,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 305 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని వివరించారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. సీఎంఆర్, రారైస్ డెలివరీ సకాలంలో జరిగేలా పర్యవేక్షిస్తామన్నారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక దృష్టి సారించామని, అత్యవసర మరమ్మతులకు ఆదేశించామని అన్నారు. జిల్లా అధికారులు ఆదిరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నరేందర్, రవీందర్, శ్రీమాల, ప్రేంకుమార్, ఏవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వలస నేతలకు అడ్డా పెద్దపల్లి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నతానియల్

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి పార్లమెంటు స్థానం వలస నాయకులకు అడ్డాగా మారిందని కొలనూర్ గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వి.నతానియల్ విమర్శించారు. కొలనూర్ గ్రామంలో మంగళవారం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతంలో పెద్దపల్లి ఎంపీగా గెలిచిన నాయకులు నియోజకవర్గంతో సంబంధం లేనివారని గుర్తుచేశారు. తద్వారా పార్లమెంటు పరిధి అభివృద్ధి సాధించలేదన్నారు. పెద్దపల్లిలో నర్సింగ్, మెడికల్ కాలేజీలు లేక నిరుద్యోగులు పట్టణప్రాంతాలకు వలస వెళ్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి తాను పోటీచేస్తున్నానని, కార్మికులు, కర్షకులు, మేదావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. నాయకులు కర్రె మహేందర్‌రెడ్డి, కర్ణకంటి కోమాల్‌రెడ్డి, మాటూరి శ్రీనివాస్, పోతర్ల మైసయ్య పాల్గొన్నారు.

ఓటమి.. విజయానికి సంకేతం



పోటీలు ప్రారంభిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్



పరుగు పందెంలో విద్యార్థులు

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

జ్యోతినగర్(పెద్దపల్లి): విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. ఎన్టీపీసీలోని మహాత్మా గాంధీ క్రీడా మైదానంలో సీఎస్సార్–సీడీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన గ్రామీణ క్రీడా పోటీలను ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. క్రీడలపై ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహిస్తే అద్భుత ప్రతిభ ప్రదర్శిస్తారన్నారు. క్రీడాభివృద్ధికి జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రెండురోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అభినందించారు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు మాట్లాడుతూ, గ్రామీణ క్రీడా పోటీల్లో 20 ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు చిన్మయిదాస్, తహసీల్దార్ కుమారస్వామి, ఎంఈవో సంపత్‌రావు, డీజీఎం శామ్యూల్ ప్రశాంత్, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, అధికారుల సంఘం ప్రతినిధులు, వివిధ యూనియన్ల నాయకులు, పీడీ కొమురోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్‌రూమ్ పరిశీలిస్తున్న హనుమానాయక్

రామగిరి(మంథని): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను ఆర్డీవో హనుమా నాయక్, రామగుండం కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ రాజు మంగళవారం పరిశీలించారు. పెద్దపల్లి పార్లమెంట్ ఓట్ల లెక్కింపు కేంద్రం, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ ఎస్.వెంకటేశ్వర్లు, డీఎల్‌పీవో శంకర్, తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎస్సై సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుపాకులు సరెండర్ చేయాలి



శ్రీనివాస్

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో లైసెన్సు కలిగిన తుపాకులను వెంటనే సరెండర్ చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ మంగళవారం సూచించారు. ఆయుధాల చట్టం 1959 సెక్షన్ 21 ప్రకారం లైసెన్సు తుపాకులు కలిగి ఉన్నవారుతా తమ సమీప పోలీసుస్టేషన్‌లో డిపాజిట్ చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా, ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా ఆయుధాలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. అలా చేయని వారిపై కేసులు నమోదు చేసేందుకు వెనకాడబోమన్నారు. డిపాజిట్ చేసిన ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి తీసుకోవచ్చని పేర్కొన్నారు. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగసంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి ఇందులో మినహాయింపు ఉంటుందని వివరించారు.

రోడ్డు ఆక్రమించిన కట్టడాల తొలగింపు



కట్టడాలు తొలగిస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో రోడ్లను ఆక్రమించిన కట్టడాలను మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. గాంధీచౌక్ చౌరస్తా నుంచి రీగల్ షూమార్ట్ వరకు పోచమ్మగుడి పక్కన ఉన్న దుకాణాలను టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావుతో కలిసి కమిషనర్ పరిశీలించారు. దుకాణాదారులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కట్టడంతోపాటు ఇనుప ఊచలతో రేకులతో కట్టిన కట్టడాలను తొలగించాలని కమిషనర్ సూచించారు. ప్లాటఫామ్‌లను వెంటనే జేసీబీలతో తొలగించారు.

ఎత్తిపోతున్న బోర్లు.. పగుళ్లు చూపుతున్న పొలాలు

- ఎండుతున్న పంటలు
- దిగుబడులపై సన్నగిల్లుతున్న ఆశలు
- పంటలు కాపాడుకునేందుకు అన్నదాతల తంటాలు



ఈ కౌలు రైతు పేరు తాటి మల్లయ్య. మంథని స్వస్థలం. అంగుళూరు శివారులో మూడెకరాలు కౌలుకు తీసుకొని ఈ యాసింగిలో వరి వేశాడు. ఎకరాకు రూ.10వేలు కౌలు చెల్లించాడు. రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాడు. పంట వేసి నెలన్నర రోజులు కావస్తోంది. గతేడాది కాలువ నీరు పుష్కలంగా వచ్చింది. అదే ఆశతో ఈసారి వరి వేయగా పొట్టదశకు చేరింది. ప్రస్తుతం రెండు తడులు నీళ్లు వస్తే సరిపోతుందని భావించాడు. కానీ 15రోజుల నుంచి కాలువ నీళ్ల కోసం ఎదురుచూస్తున్నా చుక్కనీరు రావడం లేదు. పగుళ్లు చూపిన పొలాన్ని చూపిస్తూ ఆవేదన చెందాడు. మరో నాలుగు రోజుల్లోగానైనా తడి అందకుంటే పంట ఎండి, పెట్టుబడికి తెచ్చిన అప్పు పెరిగిపోతుందని దిగాలు పడుతున్నాడు.



మంథని శివారు పోచమ్మవాడలో పగుళ్లు చూపిన పొలం



పంటలకు నీరు పారించేందుకు కాలువలో ఏర్పాటు చేసిన మోటార్లు

మంథని: జిల్లాలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాల్వ శ్రీరాంపూర్ మండలాల పరిధిలో ఎస్సారెస్పీ డి- 83 కాలువ కింద, గుండారం చెరువు ఆర్‌ఎస్‌బీ(రైట్ సైడ్ బ్రాంచ్ కెనాల్)కింద సుమారు 67 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ యాసంగిలో వివిధ పంటలు సాగయ్యాయి. అలాగే మంథని మండలం కన్నాల ప్రాజెక్టు పరిధిలో సుమారు 4 వేల ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేశారు. ఇందులో సుమారు 10 వేల ఎకరాలు ఆయకట్టు టేలెండ్ ప్రాంతం ఉంది. ఎండలు ముదిరి, బోర్లు సరిగ్గా పోయక, కాలువనీరు రాక దాదాపు పది వేల ఎకరాల ఆయకట్టు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. చాలాచోట్ల పంట పొలాలు పగుళ్లు చూపగా.. బోర్ల కింద కాస్తనీరు అందినా సరిపడా లేక కొసళ్లు తాలుగా మారుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పొట్టదశకు చేరిన వరి పంట..

- ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉంది. ఇప్పటికే ఎరువులు, పురుగుల మందులు వేసిన రైతులు.. ఎకరాపై సుమారు రూ.35వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టారు.
- మరో రెండుతడులు చూపితే పంట చేతికి అందుతుంది, కేవలం ఎకరాపై రూ.3 వేల నుంచి రూ.4వేల వరకు పెట్టుబడి పెడితే రూ.రూ.60వేల నుంచి రూ.70వేల ఆదాయం వస్తుందని అన్నదాతలు ఆశించారు.
- కానీ, టేలెండ్ ప్రాంతానికి కాలువ నీరు చేరే పరిస్థితులు లేవు.
- పోచమ్మవాడ, మల్లేపల్లి శివారు పొలాలకు సింగరేణి బొగ్గు గనుల నుంచి వచ్చిన మురుగు నీరు జాలు పారింది.
- కొంతలో కొంతైనా పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు కాలువకు మోటార్లు పెట్టుకున్నా.. వచ్చిన కాస్త జాలు ఇప్పుడు బందైంది. దీంతో మరో నాలుగు రోజుల్లో నీరు అందకుంటే పంట ఎండిపోతుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

మోటార్లతో టేలెండ్‌కు కష్టాలు

కాలువ ద్వారా వస్తున్న నీటిని కొందరు రైతులు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ మోటార్ల ద్వారా వారి పంటలకు నీటిని తరలిస్తున్నారు. దీంతో చివరి ఆయకట్టుకు నీరు చేరక పంటలు ఎండిపోతున్నాయి. కాలువల నిండా నీరు పారిన క్రమంలో రైతులు మోటార్లను వినియోగించినా చివరి పంటలకు నీరు చేరేది. కానీ, ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీరు సరిపడా లేక నీటి ప్రవాహం కొద్దిగానే వస్తోంది. మోటార్ల వినియోగంతో టేలెండ్ రైతులకు కష్టాలు తప్పడం లేదు. అయితే, అధికారులు పరిస్థితులకు అనుగుణంగా చర్యలకు వెనుకాడుతుండడంతో చివరి ఆయకట్టు పంట పొలాలు పగుళ్లు చూపుతున్నాయి.

నీళ్లు రాకుంటే నష్టమే..



ఎకరానికి రూ.30 వేల దాకా ఖర్చు అయింది. ఇంకో రెండు తడులు నీళ్లు అత్తే వరి పంట చేతికత్తది. రెండు రోజులు కాల్వకు జాలు అచ్చింది. పొలం పారుతదని ఆశపడ్డ. కానీ, ఇప్పుడు వత్తలేదు. మరో నాలుగు రోజుల్లో నీరు అందకపోతే పొలం అక్కరకు రాకుండా పోతది. ఆ తర్వాత నీళ్లు అచ్చినా లాభం లేదు. మా బాధ అర్థం చేసుకొని నీళ్లు ఇయ్యాలే.

– నరెడ్ల రాజయ్య, రైతు, పోచమ్మవాడ, మంథని

మోటార్లు తీపియ్యాలె



పైన మోటార్లు తీపిస్తే కింది దాకా నీళ్లు అందుతయి. అధికారులు చొరవ తీసుకోవాలే. మాకు ఒక్కతడి వచ్చేలా చూడండి. పెట్టుబడులు నట్టపోతం. నీళ్లు అత్తయ్ అంటేనే కదా పంటలు సాగు చేసినం. రూ.60 వేల దాకా పెట్టుబడి అయింది.

– కొట్టె మల్లయ్య, రైతు, మంథని

క్లుప్తంగా

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు


బోల్తాపడిన కారు

వేములవాడరూరల్: కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న కారు రోడ్డుపై కుక్కను తప్పించబోయి బోల్తా పడిన ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ అర్బన్ మండల పరిధి కొడుముంజ నందికమాన్ మీదుగా మోసిన్, రశీద్ కారులో సిరిసిల్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై కుక్క కనిపించడంతో దానిని తప్పించే ప్రయత్నంలో ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన ఇరువురిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

పెద్దపల్లిరూరల్: గోపయ్యపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పల్లె రాజం మంగళవారం బైక్ అదుపుతప్పడంతో కింద పడ్డ ప్రమాదంలో చేయి విరిగింది. రాజం పనినిమిత్తం కమాన్‌పూర్ వెళ్లి తిరిగి వస్తుండగా గుండారం – సబ్బితం ప్రాంతంలో బైక్ అదుపుతప్పి కిందపడి పోయాడు. స్థానికులు 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స అందిస్తున్నారు.

యువకుడి నేత్రాలు సజీవం


శివకుమార్(ఫైల్)

కరీంనగర్‌టౌన్: పెద్దపల్లి జిల్లా రొంపికుంట గ్రామానికి చెందిన త్యాళ్ల శివకుమార్(23) రోడ్డు ప్రమాదంలో మరణించగా... మహాదేవ సేవా ఫౌండేషన్ కరీంనగర్ అధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులను ఒప్పించి నేత్రదానం చేయించారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రామమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ వారు నేత్రాలు సేకరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు అవారి రాజ్ కుమార్ మాట్లాడుతూ నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి చూపు ప్రసాదించడం జరుగుతుందన్నారు. నేత్ర, అవయవ దానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడాల సుమంత్, తడిగోపుల అజయ్, వడ్లకొండ అనిల్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వారి నుంచి రూ.18,500 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాజన్నకు రూ.2 కోట్ల ఆదాయం


హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

వేములవాడ: వేములవాడ రాజన్నకు 21 రోజుల్లో రూ.2.21 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం కట్టుదిట్టమైన భద్రత మధ్య స్వామివారి హుండీలలోని డబ్బులను ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లెక్కించారు. 21రోజుల్లో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు. అలాగే 463 గ్రాముల బంగారం, 19.800 కిలోల వెండి సమకూరినట్లు వివరించారు.

రాజన్న కల్యాణ వేదిక మార్పు

- చైర్మన్ చాంబర్ ఎదుట కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు
- రేపు రాజన్న కల్యాణం
- చొరవచూపిన ప్రభుత్వ విప్

సాక్షి ఎఫెక్టు

వేములవాడ: ఏటా శివకల్యాణోత్సవంలో భక్తులు పడిన ఇబ్బందులు అన్నీఇన్ని కావు..ఈక్రమంలో 'భక్తులు పడుతున్న తిప్పలు'.. 'ఇరుకైన ప్రదేశంలో ఇలవేల్పు కల్యాణం' అనే కథనాలకు స్పందించిన ఆలయ అధికారులు ఎట్టకేలకు పార్వతీరాజరాజేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని చైర్మన్ చాంబర్ ఎదుట నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. భారీ కల్యాణ వేదిక, గుడి పరిసరాల్లో శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు కల్యాణం వీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో కేవలం ఆలయంలోని అద్దాల మంటపంలో ఇరుకైన ప్రదేశంలో కల్యాణోత్సవం జరిగేది. దీంతో కేవలం తక్కువ సంఖ్యలో భక్తులు డైరెక్ట్‌గా కల్యాణం వీక్షించేవారు. ఈక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు, శృంగేరి పీఠాధిపతుల అనుమతులు తీసుకుని వేదికను మార్పు చేయించారు. దీంతో భక్తుల తిప్పలు తప్పనున్నాయి. చలవపందిళ్లు, బారీకేడ్లు, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.


శివకల్యాణోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు

నేటి నుంచి కల్యాణోత్సవాలు

ఈనెల 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు రాజన్న ఆలయంలో నిర్వహించే శివకల్యాణోత్సవాలకు ప్రధానాలయంతోపాటు పరిసరాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానాలయంలోని కోడెలు కట్టే ప్రదేశంలో ప్రత్యేక యాగశాల ఏర్పాటు చేశారు. ఈనెల 28న ఉదయం 10.50 గంటల నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామివారల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 30న సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవం భక్తులు, శివపార్వతులు, జోగినులు, హిజ్రాల నృత్యాల మధ్య మెయిన్‌రోడ్డులో నిర్వహించనుండగా, రథాలను సిద్ధం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న నృసింహుడి బ్రహ్మోత్సవాలు



దక్షిణ దిగ్యాత్రకు వెళ్తున్న శ్రీలక్ష్మీనృసింహుడు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా జరిపిస్తున్నారు. ఉత్సవాల్లో ఏడో రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఆలయ అధికారులు, మున్సిపల్ అధికారులు సకల సౌకర్యాలు కల్పించారు. పాత టీటీడీ కల్యాణ మండపంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ముందుగా భక్తులు పవిత్ర గోదావరిలో స్నానాలు ఆచరించి అనంతరం ఆలయాల్లో మొక్కులు చెల్లించారు. ఆర్మూర్, నిర్మల్, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ఆలయం నుంచి శోభాయాత్ర

దక్షిణ దిగ్యాత్ర సందర్భంగా ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అశ్వవాహనంపై శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు, డీజే సౌండ్స్, పోలీసుల నృత్యాల మధ్య స్వామివారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పోలీస్ అధికారులు ఆలయానికి వెళ్లి స్వామివార్లను స్టేషన్‌కు ఆహ్వానించారు. అనంతరం శోభాయాత్రగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, డీఎస్పీ రఘుచందర్, ఎస్సైలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

కలిసి ఉండేందుకు నిరాకరించిందని..

- యువతిని హత్య చేసిన నిందితుని అరెస్ట్
- రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు..

మల్యాల(చొప్పదండి): ప్రేమించి పెళ్లి చేసుకుని.. కుటుంబ కలహాలతో విడాకులు తీసుకున్నాక మళ్లీ కలిసి ఉందామని నమ్మించాడు. ఆమె అంగీకరించకపోవడంతో ఆమె గొంతు నులిమి చంపేశాడు. ఈనెల 17న జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను మల్యాల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సీఐ నీలం రవి విలేకరులకు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా ముండ్రాయి మండలం నంగనూర్‌కు చెందిన కరిపె అంజలి జగిత్యాలలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుండగా గొల్లపల్లి మండలం అగ్గిమల్ల గ్రామానికి చెందిన కొల్లూరి నరేశ్‌తో 2018లో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి 2020లో వివాహం చేసుకున్నారు. కుటుంబ కలహాలతో 2022లో విడాకులు తీసుకున్నారు. అనంతరం అంజలిని యాద్రాద్రి జిల్లా గుండాల మండలం మాసంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డికిచ్చి వివాహం జరిపించారు. అయినా నరేశ్ అంజలికి తరచూ ఫోన్ చేసి మళ్లీ కలిసి జీవిద్దామంటూ వేధించేవాడు. ఈ క్రమంలో ఈనెల 17న అంజలి జగిత్యాల కొత్త బస్టాండ్‌కు రాగా.. నరేశ్ ఆమెను బైక్‌పై జాబితాపూర్ మీదుగా అగ్గిమల్ల వైపు తీసుకెళ్లాడు. మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులోకి రాగానే అంజలి నిలదీయడంతో తనను మోసం చేసి, మరొకరిని ఎలా వివాహం చేసుకుంటావంటూ రోడ్డు పక్కన బైక్ నిలిపి.. అంజలిని కొట్టి, గొంతు నులిమి చంపి మృతదేహాన్ని సమీపంలోని చిన్న కాలువలో పడేసి వెళ్లాడు. అంజలి తల్లి రజిత మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ముత్యంపేటలోని కొండగట్టు బస్టాండు వద్ద బైక్‌పై పారిపోతుండగా నరేశ్‌ను పట్టుకుని విచారణ చేపట్టారు. ఇందులో అంజలిని తానే గొంతు నులిమి చంపినట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. నిందితుడి నుండి బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని.. నరేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ నీలం రవి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నీలం రవి

కన్నీళ్లు మిగిల్చిన కాంగ్రెస్

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఎండిన వరి పంట పరిశీలన



ముత్తారం(మంథని): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రైతులకు కన్నీళ్లు మిగిల్చిందని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సీతంపల్లి, ఇప్పలపల్లి(రామకృష్ణాపూర్)లో సాగునీరు అందక ఎండిన వరి పంటను జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. కేసీఆర్ ప్రభుత్వంలో గుంట కూడా ఎండ లేదన్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో రాష్ట్రంలో 20లక్షల ఎకరాల్లో పంటలు ఎండినా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు లేని తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రైతులు ఆత్మహత్య చేసుకోవడం పరిస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయకట్టుకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మాట్లాడుతూ, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎండిన పంటలు పరిశీలిస్తున్నామని తెలిపారు.

మల్లాపూర్‌లో రూ.85వేల నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో ఎస్సై కిరణ్‌కుమార్


తనిఖీ చేస్తున్న పోలీసులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద మంగవారం సాయంత్రం చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.85వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాల తనిఖీ చేస్తుండగా.. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.85వేలను స్వాధీనం చేసుకుని గ్రీవెన్స్‌సెల్‌కి అప్పగించినట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీస్ కానిస్టేబుళ్లు సురేశ్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.54,500 నగదు పట్టివేత

మల్యాల(చొప్పదండి): సరైన పత్రాలు లేకుండా రూ.54,500 తీసుకెళ్తున్న వాహనదారుడి నుంచి మల్యాల పోలీసులు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. మండలంలోని ముత్యంపేట కొండగట్టు బస్టాండ్ వద్ద ఎస్సై అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. నిర్మల్ మండలం లోకేశ్వరం మండలానికి చెందిన నిమ్మ శివన్న వాహనంపై కరీంనగర్ నుంచి లోకేశ్వరం వైపు వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఇందులో రూ.54,500 పట్టుబడింది. డబ్బులకు ఆధారాలు లేకపోవడతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.లక్షా 52వేల 800 నగదు స్వాధీనం చేసుకున్నారు. సిరిసిల్లకు చెందిన కట్ట సతీశ్ ఎటువంటి ఆధారాల్లేకుండా రూ.92,800, మండలంలోని గోరింటాలకు చెందిన బండ సత్తవ్వ ఎలాంటి ఆధారాల్లేకుండా రూ.60వేల నగదు తీసుకెళ్తుండగా.. విచారించి సీజ్ చేశారు. ఎన్నికల విభాగం సిరిసిల్ల రిటర్నింగ్ ఆఫీసర్‌కు అప్పగించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

పడగ విప్పిన పొలి పగ

- భూ తగాదాలతో ఇద్దరు బలి
- ఒకరు ఆత్మహత్య.. మరొకరి హత్య
- జగిత్యాల జిల్లా ధర్మపురిలో విషాదం


పులి రేణుక మృతదేహం


హత్యకు గురైన పులి పద్మ

ధర్మపురి: సాగు భూమి విషయంలో తరచూ గొడవ పడుతుండడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన ఆమె భర్త.. దీనంతటికీ ఓ మహిళ కారణమని భావించి కల్లు గీసే ఉలితో గొంతుకోసి హత్య చేశాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం కమలాపూర్‌లో విషాదం నింపింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పులి లస్మయ్య, గంగన్న వరుసకు అన్నదమ్ములు. లస్మయ్య, గంగన్న ఇద్దరూ గీతవృత్తిదారులు. ఇరువురి భార్యలు బీడీలు చుడుతుంటారు. పక్కపక్కనే ఇరువురికీ భూమి ఉంది. కొంతకాలంగా వారిమధ్య గెట్ల పంచాయితీ నడుస్తోంది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గంగన్న భార్య రేణుక (50) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త గంగన్న సాయంత్రం ఇంటికొచ్చేసరికి వేలాడుతూ కనిపించింది. తన భార్య రేణుకను లస్మయ్య కుటుంబ సభ్యులే చంపారని భావించిన గంగన్న ఆవేశంతో వెళ్లి లస్మయ్య భార్య పద్మ (45)ను కల్లు గీసే ఉలితో మెడపై కోశాడు. దీంతో పద్మ రక్తపుమడుగులో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే భర్త లస్మయ్య ఇంటికి చేరుకుని భయాందోళనతో పరుగులు తీశాడు. ఆత్మహత్య చేసుకున్న రేణుకకు ఇద్దరు కుమారులు ఉన్నారు. హత్యకు గురైన పద్మకు కుమారుడు, కూతురు ఉన్నారు.

శోక సంద్రంలో రెండు కుటుంబాలు

పులి రేణుక ఆత్మహత్య చేసుకోవడం.. పద్మ హత్యకు గురికావడంతో రెండు కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి. పద్మ ఇంట్లోకి పోలీసులు ఎవరినీ అనుమతించలేదు. రేణుకను లస్మయ్య కుటుంబమే ఉరివేసి చంపారంటూ గంగన్న రోదిస్తూ తెలిపాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గ్రామానికి చేరుకొని ఇరు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆత్మహత్య, హత్యకు గల కారణాలు దర్యాప్తులో తేలనున్నాయని, సంఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ఎల్ఎండీ ఎగువకు ఏప్రిల్ 2 వరకే సాగునీరు


ఎస్సారెస్పీ నుంచి స్టేజీ-2కు విడుదలవుతున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఎల్ఎండీ ఎగువ ఆయకట్టు (జోన్-2)కు ఏప్రిల్ రెండోతేదీ వరకే సాగునీరు అందించనున్నట్లు ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు. ఎస్సారెస్పీలో నీటి మట్టం 17.183 టీఎంసీలకు పడిపోవడంతో ఎల్ఎండి దిగువ భాగం (జోన్-1) ఆయకట్టుకు ఈనెల 25వరకే నీటి విడుదల నిలిపివేశారు. కాకతీయ కాలువ ప్రారంభం నుంచి డి-53 (జగిత్యాల ప్రాంతం) వరకు కాలువ తూములను ప్రాజెక్టు అధికారులు మూసివేశారు. ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకి చేరడంతో మిగిలిన నీటిని తాగునీటి అవసరాలకు నిల్వ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి లక్ష్మీకెనాల్‌కు 200 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 300, అలీసాగర్ ఎత్తిపోతలకు 347, గుత్ప ఎత్తిపోతలకు 146, మిషన్ భగీరథ కింద కోరుట్ల, జగిత్యాల, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ ప్రాంతాలకు 231క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో రోజుకు 432 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

విషాదం నింపిన కోడిగుడ్డు వివాదం

- చికిత్స పొందుతూ మహిళ మృతి


రమ (ఫైల్)

జగిత్యాలరూరల్: కోడిగుట్టు వివాదం విషాదం నింపింది. ఈ గొడవలో కొడవలి వేటుకు గురైన మహిళ తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయింది. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మేడిపల్లి సురేశ్-రమ(40)దంపతులకు కొడుకు రిషివర్ధన్, కుమార్తె వాణి ఉన్నారు. సురేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. వీరి కుమార్తె వాణిని ఇదే గ్రామానికి చెందిన బోగ ప్రకాశ్ అనే యువకుడు కొద్ది రోజుల క్రితం పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో సురేశ్, రమ దంపతులు నిరాకరించారు. కక్ష పెంచుకున్న ప్రకాశ్ సోమవారం జరిగిన హోలీ వేడుకల్లో రమ ఇంట్లోకి కోడిగుడ్డు విసిరాడు. దీంతో రిషివర్ధన్ తమ ఇంట్లోకి కోడిగుడ్డు ఎందుకు విసిరావని ప్రకాశ్‌ను నిలదీయగా రిషివర్ధన్‌పై దాడిచేశాడు. స్థానికంగా ఉన్న వారు రిషివర్ధన్ తల్లి రమకు సమాచారం అందించడంతో అక్కడకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రకాశ్ కొడవలితో రమ మెడపై దాడిచేశాడు. గొంతుకు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలి కొడుకు రిషివర్ధన్ ఫిర్యాదు మేరకు ప్రకాశ్‌పై హత్య కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐఆరీఫ్ అలీఖాన్, రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

గ్రామంలో విషాదం

తిప్పన్నపేట గ్రామంలో మేడిశెట్టి రమ హోలీ సంబరాల్లో కోడిగుడ్డు వివాదంలో హత్యకు గురికాగా గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం అందరు మహిళలతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్న రమ హత్యకు గురికావడం గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. దుబాయ్‌లో ఉన్న ఆమెభర్త సురేశ్ మంగళవారం స్వగ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

చిట్టిగుండెకు పెద్దకష్టం

- చిన్నారి గుండెకు రంధ్రం
- రేషన్‌కార్డు లేకపోవడంతో వైద్యానికి వర్తించని ఆరోగ్యశ్రీ
- ఇప్పటికే రూ.6 లక్షల ఖర్చు
- మరో రూ.7 లక్షలు అవసరం
- దాతల కోసం పేద కుటుంబం ఎదురుచూపు


తల్లిదండ్రులతో అక్షర

గంగాధర: రెక్కాడితే కానీ డొక్క నిండని పరిస్థితి ఆ కుటుంబానిది. అయినా చెరోకష్టం చేసుకుంటూ ఆ దంపతులు వారి ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్నారు. పెద్ద కూతురు గుండెకు రంధ్రంతో జన్మించగా.. ఎనిమిదేళ్లుగా మందులు వాడుతోంది. శాశ్వత పరిష్కారం కోసం ఆపరేషన్ చేయాల్సి ఉండగా.. ఆ కుటుంబానికి రేషన్‌కార్డు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు. ఇప్పటికే మందులకు రూ.6లక్షలకు పైగా ఖర్చుచేయగా.. శాశ్వత పరిష్కారానికి ఆపరేషన్ చేయాలంటే మరో రూ.7లక్షలు అవసరం కానున్నాయి. పేద కుటుంబం కావడంతో దాతలకోసం ఎదురుచూస్తున్నారా దంపతులు. గంగాధర మండలం మధురానగర్‌కు చెందిన రామగిరి నరేశ్-శిరీష దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు అక్షరకు ఎనిమిదేళ్లు. పుట్టుకతోనే గుండెకు రెండు రంధ్రాలు ఏర్పడ్డాయి. సమస్యను పరిశీలించిన వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతున్నారు. ప్రస్తుతం ఒక హోల్ కూరుకుపోగా.. మరొక రంధ్రం సమస్యను తీవ్రం చేస్తోంది. ఈ హోల్‌తో చెడురక్తం, మంచి రక్తం కలిసి వెళ్తుండడంతో తీవ్ర అనారోగ్యపాలవుతోంది. నిత్యం నీరసం, జ్వరం, ఆయాసంతో బాధపడుతోందని తల్లిదండ్రులు తెలిపారు. త్వరగా ఆపరేషన్ చేయిస్తే ఆరోగ్యం మెరుగవుతుందని, రేషన్ కార్డు ఉంటే ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్ చేస్తామని, లేకుంటే రూ.7లక్షలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పినట్లు వెల్లడించారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసి ఏళ్లు గడుస్తోందని, తమ సమస్యపై ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు. తమ కూతురు వైద్యానికి దాతలు సహకరించాలని వేడుకుంటున్నారు.

రైలింజన్‌లో పొగలు


రామగుండంలో నిలిచిన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

రామగుండం: జాసిదియా(ఛత్తీస్‌గఢ్) జంక్షన్ నుంచి వాస్కోడగామ(గోవా) వెళ్తున్న రైలు ఇంజన్(నంబరు 17322)లో మంగళవారం రాత్రి పొగలు వచ్చాయి. అప్రమత్తంగా వ్యవహరించిన లోకోపైలట్లు రామగుండంలో రైలు నిలిపివేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం పెద్దంపేట రైల్వేస్టేషన్ దాటిన తర్వాత రైలింజన్ నుంచి స్వల్పంగా పొగలు రావడాన్ని లోకోపైలట్లు గమనించారు. ఆ వెంటనే రామగుండం రైల్వే లోకో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రామగుండం చేరుకోగానే రైలు నిలిపివేశారు. మంచిర్యాలకు మంగళవారం మధ్యాహ్నం 2.34 గంటలకు చేరుకోవాల్సిన వాస్కోడగామ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు.. ఐదు గంటల ఆలస్యంగా రాత్రి 7.09 గంటలకు మంచిర్యాలకు చేరుకుంది. తర్వాత కాజీపేటలోనే హాల్టింగ్ ఉండగా రైలింజన్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో పొగలు రాగా రామగుండంలో అత్యవసరంగా నిలిపివేశారు. స్థానిక లోకో ఉన్నతాధికారులు దానిని వేరుచేసి మరో ఇంజన్‌ను తగిలించి రైలును పంపించారు. రామగుండంలో రెండు గంటల ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మద్యం మత్తులో మైనర్ల హంగామా

- నడిరోడ్డుపై తన్నుకున్న వైనం
- చైల్డ్ వెల్ఫేర్ అధికారులపై రాళ్లు రువ్విన బాలురు


పారిపోతున్న బాలుడిని పట్టుకున్న చైల్డ్‌వెల్ఫేర్ సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని విద్యానగర్ బైపాస్‌రోడ్‌లో పోచమ్మవాడకు చెందిన నలుగురు మైనర్ బాలురు అతిగా మద్యం సేవించి మంగళవారం సాయంత్రం హంగామా సృష్టించారు. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. భయభ్రాంతులకుగురైన స్థానికులు 1098కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చేసరికి ముగ్గురు బాలురు విద్యానగర్ వైపు పారిపోయారు. ఓ బాలుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా సిబ్బందిపై రాళ్లు రువ్వారు. చైల్డ్‌వెల్ఫేర్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి బాలుడిని అదుపులోకి తీసుకుని కరీంనగర్‌లోని ఓ వసతి గృహానికి తరలించినట్లు సమాచారం.

నదిలో దూకేందుకు యువకుడి యత్నం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గోదావరి బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకేందుకు ప్రయత్నించిన యువకుడిని పోలీసులు కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం.. కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం గోదావరి నదిలో దూకేందుకు వస్తున్నట్లు టూటౌన్ సీఐ రవీందర్‌కు సమాచారం అందింది. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో గోదావరి బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌టీం పోలీసులకు సీఐ వెంటనే సమాచారం అందించారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ జంపయ్య, కానిస్టేబుల్ పూర్ణచందర్ ఆ యువకుడిని గమనించి నదిలో దూకకుండా అడ్డుకున్నారు. తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి తన కుటుంబ సభ్యులకు అప్పగించారు.